## శ్రీశైలం దేవస్థానం ఈవోగా డి .పెద్దిరాజు కొనసాగింపు

అమరావతి : ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానం ఈవో గా డి పెద్దిరాజు కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం సర్వీసును కొనసాగిస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఈవోగా పనిచేసిన లవన్న నుంచి బాధ్యతలు స్వీకరించిన పెద్దిరాజు సంవత్సరం నుంచి సేవలు అందిస్తున్నారు. అయితే సర్వీసు గడువు ముగియడంతో పొడిగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తీశ్వరాల యంలో ఈవో గా ఆయన పనిచేశారు.


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 08-10-2024 | సంపుటి : 06 | సంచిక : 13 | పేజీలు : 8 | వెల : రూ 3-00


# ప్రధాని మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ



ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి బయలుదేరిన చంద్రబాబుకు ఢిల్లీలో టీడీపీ ఎంపీలు స్వాగతం పలికారు. సెప్టెంబర్ మొదటివారంలో ఏపీని వణికించిన వర్షాలు, వరదల తరువాత ఏపీ సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ని కలిసి చంద్రబాబు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులపై చర్చించారు. ప్రధానం అమరావతి , పోలవరం ప్రాజెక్టుకు నిధులతో పాటు వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలకు నిధుల కేటాయింపు చర్చించినట్లు సమాచారం. సెయిల్‌లో విశాఖ స్టీల్ విలీనం, రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వేజోన్ శంకుస్థాపన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా రేపు (మంగళవారం) పలువురు కేంద్ర మంత్రు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్ , పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో కలువనున్నారు.

# మోదీ వేసిన పునాదులతో 2047 నాటికి వికసిత్ భారత్‌ను చూస్తాం: పవన్ కల్యాణ్

ప్రధాని మోదీ వేసిన పునాదులతో 2047 నాటికి వికసిత భారత్‌ను చూస్తామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా నరేంద్ర మోదీ ప్రమాణం చేసి 23 ఏళు అవుతున్న సందర్భంగా ఆయనకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా 23 ఏళ్ల క్రితం ఇదే రోజున నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని పవన్ కల్యాణ్ తెలిపారు. విప్లవాత్మక నిర్ణయాలతో కోట్లాది మంది భారతీయుల జీవితాలను మార్చడం ఆ రోజుతోనే మొదలైందని అన్నారు. ఆయన నాయకత్వంలో మన దేశం విశ్వవ్యాప్తంగా కీర్తిని పొంది.. అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని చెప్పారు. త్వరలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లుగా అంకిత భావంతో పనిచేస్తూ ప్రజా సేవ కంటే మరేది ముఖ్యం కాదని మోదీ నిరూపించారని చెప్పారు. భారత దేశ వైవిధ్యతతను లోతుగా అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలతో కలిసిపోగలిగే లక్షణాలు.. క్లిష్టమైన



సమస్యలను పరిష్కరించడంతో పాటు మార్పు తీసుకురావడంలో సహాయం చేశాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన నాయకత్వం దేశాన్ని పురోగమించే దిశగా తీసుకెళ్లడంతో పాటు.. అనేక మంది జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఆయన వేసిన పునాదులతో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని చూస్తామని అభిప్రాయపడ్డారు.

## ఏపీలో ఈనెల 10 నుంచి మళ్లీ వర్షాలు.. :వాతావరణశాఖ హెచ్చరిక

అమరావతి : ఏపీలో మళ్లీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 10 నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇదే నెలలో అరేబియా సముద్రంలో ఒకటి, బంగాళాఖాతంలో మరో తుఫాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించారు. తుఫాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఆదివారం ఏలూరు(ఇశ్రీబీతీబీ), తూర్పుగోదావరి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, ఎన్టీఆర్, అనకాపల్లి, కర్నూలు(ఐబీతీనినీనీశ్రీ), నంద్యాల, తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా రాజమహేంద్రవరంలో 53 మి.మీ. వర్షం కురిసింది. కొన్ని జిల్లాల్లో వేడి వాతావరణం కొనసాగుతోంది. కావలిలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 37.6 డిగ్రీలుగా నమోదైంది. కావలి, విశాఖపట్నం, తుని, కాకినాడ, నెల్లూరు, కడప, అనంతపురం, నందిగామ, నరసాపురం, తిరుపతి, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు పెరిగాయి.

## నేడు హర్యానా, జమ్మూకశ్మీర్ ఓట్ల లెక్కింపు



హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు నేడు జరుగనున్నది. ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు మొదలు కానున్నది. హర్యానాలో బిజెపి మూడో సారి గెలుపు కోసం చూస్తోంది. అయితే కాంగ్రెస్ అధికారం కైవసం చేసుకోవాలనుకుంటోంది. జెజెపి, ఐఎన్ఎల్ డి వంటి అనేక స్థానిక పార్టీలు తల్లక్రిందులు చేయాలనుకుంటున్నాయి. ఇక జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అందరికీ ఆసక్తి ఉంది. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మిత్రపక్షం తప్పక విజయం సాధిస్తాయనుకుంటున్నారు. ఆ రెండు ఇండియా బ్లాక్ లో ఉన్న పార్టీలే. పిడిపి ఆశ్చర్యకర ఫలితాలను సాధించాలనుకుంటోంది.

# పబ్లిక్ గ్రీవెన్స్ కు 86– ఫిర్యాదులు

### జిల్లా ఎస్పీ. శ్రీ అధిరాజ్ సింగ్ రాణా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07– జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) 86– అర్జీలు వచ్చాయని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్,




సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కారం ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఎన్ .యుగంధర్ బాబు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

## మహాచండీ అవతారంలో దుర్గమ్మ



విజయవాడ,అక్టోబర్7 : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించారు. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహంతో విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారడంతో పాటు ఏ కోరికలతో ప్రార్థిస్తామో అవన్నీ సత్వరమే లభిస్తాయనేది భక్తజనుల నమ్మకం. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### కల్పవృక్ష వాహన సేవలో దర్శనమిచ్చిన శ్రీవారు
### మాడవీధుల్లో ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శనలు
### నేటి గరుడోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేసిన టిడిడి



తిరుమల,అక్టోబర్7 : కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరగనుంది. మరోవైపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో గోవిందనామ స్మరణతో సప్తగిరులు మార్మోగుతున్నాయి. భక్తులు వాహన సేవలను తిలకించి భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరువీధులు భక్తులతో నిండిపోయి. గోవింత నామస్మరణలతో మారుమోగుతున్నాయి. తిరుమల శ్రీనివాసుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా.. శ్రీవారికి ఘనంగా నిర్వహించే గరుడ వాహనసేన మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11గంటల వరకు జరగనుంది. ఈ గరుడ వాహన సేవ కోసం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గరుడసేవను తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా పోలీసులు, టీటీడీ భద్రతాధికారులతో కలిసి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. దానిలో భాగంగా.. నేటి అర్థ రాత్రి నుంచి కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాలను నిషేధించటంతో పాటు, కొండ కింద అలిపిరి దగ్గర వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ సేవకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. మాడవీధుల గ్యాలరీ రెండు లక్షల మంది భక్తులు వాహనసేవను తిలకించేందుకు వీలు ఉందని చెప్పారు. క్యూలైన్ల నుంచి మాడవీ ధుల కూడలికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు.

# దసరా కానుకగా ఐ ఆర్ ప్రకటించాలి..

### ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆప్టా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు..



విభారె న్యూస్ అక్టోబర్ 07 కర్నూలు జిల్లా ప్రతినిధి.. ఈ నెల 12 వ తేదీ దసరా సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐ ఆర్ ప్రకటించి పే రివిజన్ కమిషన్ను ఏర్పాటు చేసి తీపి కబురు అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ జి ఎస్ గణపతి రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు 11వ పి ఆర్ సి లో ఎంతో అన్యాయం చేసిందని అలాగే డమ్మీ పిఆర్సి కమిషన్ వేసి మోసం చేసిందని వారు దుయ్యబట్టారు,ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 12వ పే రివిజన్ కమిషన్ వేసి ఐ ఆర్ ను ప్రకటించి మన ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకుంటారని వారు ఆశాభావం వ్యక్తపరిచారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వవలసినటువంటి సరెండర్ లీవ్ బకాయిలను 2022 మే నుంచి పెండింగ్లో పెట్టిందని తక్షణమే ముఖ్యమంత్రి వర్యులు ఉపాధ్యాయ ఉద్యోగులకు సి ఎఫ్ ఎం ఎస్ లో అప్రూవ్ అయి పెండింగ్ లో వున్నటువంటి చెల్లింపులన్నిటిని ఉద్యోగులకు దసరా కానుక చెల్లించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు కోరారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన 12 డిఏలు పెండింగ్లో ఉన్నాయని వాటిలో కొన్ని అయినా ఇప్పుడు ఉద్యోగులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరటం జరిగింది. ప్రభుత్వము ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉపాధ్యాయ, ఉద్యోగుల విషయం లో తీసుకోవలసిన చర్యలు వేగవంతం చేయ వలసి వుందని కోరారు.

# సంపాదకీయం

మంగళవారం 08-10-2024

## చివరి దశకు చేరుకున్న నక్సల్స్ పోరాట బరి

ఆధునిక సమాజంలో సమస్యల రూపం సమూలంగా మారిపోయింది. కానీ, అడవుల్లో ఉన్న ఉద్యమ నాయకులు మాత్రం గత భూస్వామ్య, పెట్టుబడిదారీ భావజాలంలోనే కొనసాగుతున్నారు. గ్లోబలైజేషన్ అడవులకు చేరుకుంటున్న తరుణంలో.. అడవుల్లో గిరిజనులే లేకుండా పోతున్నారు. నక్సలైట్లుగా మారే వాళ్ల తక్కువవుతుంటే.. ఉన్నవారికి లొంగుబాట్లు, కుంగుబాట్లే మిగిలాయి. మహిళల్నీ, బాలికల్నీ రిక్రూట్ చేసుకుంటున్న పరిస్థితులు పెరిగాయి. దాదాపు రెండు దశాబ్దాల నుండి నడుస్తున్న ఈ సంక్షోభం ఇప్పుడు పీక్స్‌కు చేరుకుంది. ఉద్యమం నీరుగారిపోయి, మావోయిజం మసకబారుతోందిదాదాపు ఐదు దశాబ్దాల తర్వాత, అనేక ఒడిదుడుకులను తట్టుకుని నిలబడిన మావోయిస్ట్ ఉద్యమం ఇప్పుడు దాని చివరి దశను చేరుకుంటుంది. ఎన్‌కౌంటర్ ఘటనలు, లొంగిపోతున్న మావోయిస్టులు, అరెస్టవుతున్న మావోయిస్టుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ నక్సలైట్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఎదురు కాల్పులు జరిగితే భద్రతా దళాలకు కూడా నష్టం వాటిల్లేది. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. పదులు సంఖ్యలో నక్సలైట్లు రాలిపోతున్నారు. భద్రతా దళాల దాడుల్లో ఆధునిక పరికరాలు వాడుతున్నారు. ఒకవైపు, నక్సలైట్లకు టెక్నాలజీ దూరమవుతుంటే.. భద్రతా బలగాలకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. అడవులు తగ్గుతున్న కొద్దీ మావోయిస్టులకు స్థావరాలు తగ్గుతూ వస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, పర్యాటకం పేరుతో కారడవుల్లోనూ కాటేజ్‌లు వస్తున్నాయి. మరోవైపు, రాను రాను నక్సలైట్ల సంఖ్య తగ్గుతుంటే ఉద్యమంలో 1990ల మధ్యకాలం నుండి కొత్త రిక్రూట్‌మెంట్లు జరగట్లేదు. మావోయిస్టు భావజాలానికి ప్రత్యేకించి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలోని విద్యార్థుల్లో ఎవరూ లేరు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో 2004లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ నిషేధం తర్వాత రిక్రూట్‌మెంట్లపై పెద్ద దెబ్బ పడింది. ఒక విధంగా, ఉద్యమంలో చేరడానికి మనుషులే కరువయ్యారు.ఒకప్పుడు బాగా చదువుకున్న మేధావులు కూడా ఉద్యమంలో భాగస్థులు అయ్యేవారు. పెత్తందారీ పాలనకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం వ్యూహాత్మకంగా బలంగా ఉండేది. అయితే, రాను రాను ఉద్యమంలో సభ్యుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. ఏ పెట్టుబడీదారి, గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా మావోయిస్టులు పోరాటం చేశారో.. అదే, గ్లోబలైజేషన్ అభివృద్ధి పేరుతో వచ్చి, పేదలకు సైతం వృత్తి ఉద్యోగావకాశాలను పెంచింది. రానురాను రోడ్డు రవాణా మెరుగువుతోంది. అసలు, ఏ అడవి బిడ్డల కోసం నక్సలైట్లు పోరాటం మొదలుపెట్టారో ఆ అడవుల్లో జీవించేవారే తక్కువయ్యారు.చదువుకుంటున్న ఆదివాసీ యువతంతా వృత్తి విద్యల కోసం నగరాల బాట పట్టారు. నిరక్షరాస్యులు, అవకాశాలకు దూరమైన వారు తప్ప అడవుల్లో నివసించే వారే తక్కువయ్యారు. దీనితో, ఉద్యమంలో నుండి వెళ్లిపోయేవారే తప్ప కొత్తగా వచ్చేవారు లేరు. దీనితో, అత్యంత వెనుకబడిన ప్రాంతాల నుండి బలవంతంగా యువతను లాక్కుంటున్న పరిస్థితి వచ్చింది. వారికి సరైన శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోవడంతో సంఖ్యా బలం తప్ప బుద్ధి బలం లోపించిన పరిస్థితులు వచ్చాయి. ఒకొక్కరిగా సీనియర్ లీడర్లంతా కనుమరుగవుతుంటే.. ఉన్నవారితోనే ఉద్యమాన్ని నడిపాల్సి అవసరం వచ్చింది. డాక్టర్లు, ఇంజినీర్లు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు కనుమరుగయ్యి.. గన్ను పట్టుకోవడం వచ్చినవారే ఎక్కువయ్యారు. ప్రభుత్వం పోలీసింగ్ పెంగే కొద్దీ, అడవుల్లో మావోయిస్ట్ పోటన్సీ తగ్గుతూ వచ్చింది. 2011లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ రూపొందించిన ఒక నివేదికలో.. ఈ ప్రాంతంలో ఉద్యమం స్తబ్ధత స్థాయికి చేరుకుందని పేర్కొంది. దీనిని, 2013-14లో సెంట్రల్ కమిటీ కూడా ఆమోదించింది.2014లో, అప్పటి సిపిఐ-మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి.. అన్ని రాష్ట్ర కమిటీలకు రాసిన లేఖలో కీలకమైన వ్యాఖ్యలు చేశారు. నష్టాలను తగ్గించండనీ, బలమైన కోటలను రక్షించండని అందులో ఉత్తర్వు ఇచ్చారు. ఈ పరిణామం, మావోయిస్ట్ ఉద్యమ తిరోగమనాన్ని సూచిస్తుంది. అప్పటికే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి చాలా రాష్ట్రాల్లో గ్రేహౌండ్స్, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ వంటి నక్సల్ వ్యతిరేక పోరాట దళాలు వచ్చేశాయి. ఇది కీకారణ్యంలోకి కూడా చొరబడి, అగ్ర నాయకులను చంపేశాయి. అప్పటి నుంచి మావోయిస్టుల కార్యకలాపాల పరిధి తగ్గుతూ వస్తోంది. అది ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో, లేదంటే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్‌లలో ఉంటుంది. గతంలో ఈ ప్రాంతాల్లో మావోయిస్టుల మాత్రమే పరిష్కరించే సమస్యలను ఇప్పుడు తర్వాతి తరంలోని మధ్యతరగతి నాయకత్వంలో గిరిజన ప్రజలు బలంగా మారారు. మైదాన ప్రాంతాల ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇలాంటి పరిస్థితుల మధ్య ఒకప్పుడు పదులు సంఖ్యలో ఉన్న కేంద్ర కమిటీ బలం ఇప్పుడు వేళ్లపై లెక్కపెట్టే స్థాయికి వచ్చింది. ఇందులో కూడా దాదాపు 60 ఏళ్లు పైబడిన నాయకులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. వారిలో కూడా దాదాపు 70% మంది ఏపీ, తెలంగాణకు చెందిన వారు. వీరిలో చాలా మంది చనిపోయారు కూడా. మధ్య స్థాయి నాయకత్వం కూడా బలంగా లేదు. ఏది ఏమైనప్పటికీ, మావోయిస్ట్ ఉద్యమానికి కాలం చెల్లింది. నానాటికీ పెరుగుతున్న లొంగుబాట్లతో శాంతి చర్చలు చేసే పరిస్థితి కూడా లేదు. ఇక, పోరాటం అంటారా.. దాని రూపం మార్చుకొని చాలా కాలం అయ్యింది. బూటకమైనా, నాటకమైనా అది ప్రజాస్వామ్య బద్ధంగానే జరుగుతుందనే రాజకీయం పెరిగింది. అందులో నుండి సమస్యలను పరిష్కరించాలి తప్ప అడవుల్లో ఇక స్థానం లేదన్నది స్పష్టంగా కనిపిస్తుంది.

## కర్నూల్ సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా షేక్ జిలాని భాష







విభారే న్యూస్. అక్టోబర్ 7. కర్నూలు ప్రతినిధి కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా షేక్ జిలాని భాష పదవి బాధ్యతలు స్వీకరించారు సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిలాని భాష నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసిన జిలాని భాష మాట్లాడుతూ నా మీద నమ్మకంతో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించిన ఎఐసిసి అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే కి, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి కి నాకు సహకరించిన కర్నూలు, నంద్యాల డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ కి, జె లక్ష్మి నరసింహ యాదవ్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పార్టీ అధిష్టానం ఆదేశించిన కార్యక్రమాలను చేపట్టి కర్నూలు నగరంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రతి వార్డులో తిరిగి బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక వార్డులలో గెలిపిస్తానని జిలాని భాష హామీ ఇచ్చారు. అనంతరం కర్నూలు డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని కేంద్రంలో రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిగా, రాష్ట్రంలో వైఎస్ షర్మిలా రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యమని తెలియజేశారు. అనంతరం నంద్యాల డిసిసి అధ్యక్షులు జె లక్ష్మి నరసింహ యాదవ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జాన్ విల్సన్ గారికి వీడ్కోలు సన్మానం, నూతన అధ్యక్షులు జిలాని భాష గారికి స్వాగత సన్మానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, ఎమ్మిగనూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్, ఏం ఖాసిం వలి, మంత్రాలయం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి మురళీ కృష్ణంరాజు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎన్ సి బజారన్న, కే వెంకటరెడ్డి, కె సత్యనారాయణ గుప్త, పీజీ ప్రదీప్ యాదవ్, రియాజుద్దీన్, ఎస్ ప్రమీల, ఏ వెంకట సుజాత, షేక్ ఖాజా హుస్సేన్, ఖాద్రి పాష, అనంతరత్నం మాదిగ, ఈ లాజరస్, సయ్యద్ నవీద్, షేక్ మాలిక్ భాష, బి సుబ్రహ్మణ్యం, సాయికృష్ణ, అబ్దుల్ హై, వెల్దుర్తి శేషయ్య, గీతా ముఖర్జీ నగర్ రమేష్, జాన్ సదానందం, అక్బర్ ఐఎన్టీయూసీ ఎన్ సుంకన్న, ఆర్ ప్రతాప్, అక్బర్, రంగస్వామి మహిళా కాంగ్రెస్, ఏ లలిత, హైమావతి, కరుణమ్మ, సావిత్రి, అయ్యమ్మ మద్దమ్మ, స్వప్న, సలోమి మొదలగు వారు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించిన జిల్లా ఎస్పీ..



విభారె న్యూస్ అక్టోబర్ 07 కర్నూలు జిల్లా ప్రతినిధి..విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం.కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 132 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ. దివ్యాంగుల వద్దకు వెళ్ళి ఫిర్యాదులను స్వీకరించి, న్యాయం చేస్తామని భరోసా కల్పించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) కర్నూలు వెంకటరమణ కాలనీ కి చెందిన షేక్ సాదిక్,షేక్ తస్లీమా, గుంటూరు కు చెందిన రవి లు కలిసి మాకు బ్యాంక్ ఆఫ్ బరోడా లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఫేక్ లెటర్స్ ఇచ్చి 5 మంది నుండి రూ.30 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు, బంగారు పేటకు చెందిన దివ్యాంగుడైన మురళీ మోహన్ ఫిర్యాదు చేశారు. 2) పెద్దల నుండి వంశపార్యం పరంగా వచ్చిన 3 ఎకరాల పొలాన్ని మా వదిన సరోజ ,రిటైర్ట్ ఉద్యోగి రత్నస్వామి 3 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నారని అన్యాయం చేశారని నాకు పొలాన్ని,స్థలాన్ని ఇప్పించే విధంగా న్యాయం చేయాలని గార్గేయపురం కు చెందిన దివ్యాంగుడైన దేవదానం ఫిర్యాదు చేశారు. 3) జూలై 31న లొద్ది పల్లె హై స్కూల్ లో రికార్డు అసిస్టెంట్ గా పని చేస్తూ రిటైర్ అయ్యాను. గవర్నమెంట్ ఆర్డర్ కాపీ వచ్చింది.స్కూల్లో పని చేస్తున్న హెడ్ మాస్టర్ ఎమ్. విజయభాస్కర్ పెన్షన్ పత్రాల పై సంతకాలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు కు చెందిన రిటైర్ట్ ఉద్యోగి వెంకట రమణ రాజు ఫిర్యాదు చేశారు. 4) ప్రవేట్ గా చిట్ ఫండ్ పేరుతో చీటీలు వేసి 50 మంది బాధితుల నుండి కర్నూలు బాలాజీ నగర్ కు చెందిన తెలుగు నాగరాజు కుమారుడు దుర్గ ప్రసాద్ రూ.10 కోట్ల మేర డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని కర్నూలు కు చెందిన బాధితులు సురేష్, అశోక్, సునీల్ మరియు 12 మంది ఫిర్యాదు చేశారు. 5) మొబైల్ చూస్తుంటే ఇన్ స్టా గ్రాం లో ఆఫర్ వచ్చింది,తక్కువ రేటు కే డ్రస్సులు,వస్తువులు వస్తాయని చెప్పారు.నా బ్యాంకు ఎస్ బి ఐ క్రెడిట్ కార్డుతో అప్లై చేస్తూ ఉంటనే ఒక నిమిషంలోనే సైబర్ నేరగాళ్ళు నా బ్యాంకు ఖాతా నుండి రూ. 18,800 పోయాయని న్యాయం చేయాలని కర్నూలు కు చెందిన రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ డేవిడ్ ఫిర్యాదు చేశారు. 6) కర్నూలు,ఆదోని, గుడూరు లలో గ్రూప్ ? 4 ఉద్యోగాలు ఇప్పిస్తామని ముళ్ళ చాంద్ తాత మధ్యవర్తిత్వం చేసి మా ముగ్గరీ నుండి రూ. 20 లక్షలు తీసుకొని మధుసుధన్ అనే వ్యక్తి మోసం చేశాడని ఎమ్మిగనూరు,నందవరం కు చెందిన బాధితులు రాజు,వెంకప్ప,మురళీ ఫిర్యాదు చేశారు. 7) 30 మంది డిస్ట్రిబ్యూటర్లతో కర్నూలు లో మసాలా వ్యాపారం చేస్తున్నాను. కంబం కు చెందిన మనోహర్ 8 నెలల

## ప్రజలకు సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం. ఎమ్మెల్యే డా బి.వి. జయనాగేశ్వర రెడ్డి..

విభారె న్యూస్ అక్టోబర్ 07 ఎమ్మిగనూరు..గోనెగండ్ల మండలంలోని మండల హెడ్ క్వాటర్ గోనెగండ్ల బాషా ఫంక్షన్ హాలు యందు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా బి వి జయనాగేశ్వర రెడ్డి గోనెగండ్ల మండలంలోని రెవెన్యూ,పోలీసు, ఎంపీడీఓ,హౌసింగ్, వ్యవసాయ,వెలుగు తదితర అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా బి వి జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ఎన్ డి ఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలకు సుపరిపాలనతో పాటు సత్వర న్యాయం అందే విధముగా చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగానే ప్రజలు తమ సమస్యలపై అర్జీలు రాసుకొని కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇలా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోనెగండ్ల మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే డా బి వి జయనాగేశ్వర రెడ్డి కి విన్నవించడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అందులో అలువాల గ్రామానికి చెందిన జె.నాగరాజు తన తండ్రి తమ 5 గురు అన్నదమ్ములకు ఇచ్చిన పొలం తన తమ్ముడు అధికారులతో కుమ్మక్కు అయి పొలం మొత్తం తన పేరుమీద ఎక్కుంచుకున్నారని వెంటనే తమకు న్యాయం చేయాలనీ కోరారు.ఎర్రబాడు గ్రామానికి చెందిన కె చిన్నరాముడు తమకు సంభందించిన పొలం ఆన్లైన్ లో ఆర్ ఓ ఆర్ అడంగల్ ఎక్కించాలని వినతి పత్రం సమర్పించారు.కున్నూరు గ్రామానికి చెందిన రైతు వడ్డే బజారి తమకు సంభందించిన పొలం ఆన్లైన్ లో ఆర్ ఓ ఆర్ అడంగల్ ఎక్కించాలని కోరారు.గోనెగండ్ల గ్రామానికి చెందిన ఇమ్మానియేల్ తనకు అర్హత ఉన్న పెన్షన్ రావడం లేదని కోరారు.ఐరన్ బండ గ్రామానికి చెందిన భాగ్యమ్మ తమకు స్వంత ఇల్లు లేక పూరి గుడిసెలో ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నామని తమకు హౌసింగ్ స్కిం కింద ఇల్లు మంజూరు చేయాలనీ కోరారు. పెద్దనేలటూరు గ్రామానికి చెందిన షేక్షావలి తమ కాలనిలో సిసి రోడ్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.కులుమాల గ్రామానికి చెందిన అబ్దుల్ తమ గ్రామంలో గల ఈద్గా ఖబరస్తాన్ కు కాంపౌండ్ వాల్ నిమరించాలని వినతి పత్రం సమర్పించారు. గోనెగండ్ల మండలంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యే డా బి.వి.జయనాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగినది.ప్రజల నుండి వచ్చిన వినతులను ఓపిగ్గా తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంభందిత శాఖా అధికారులను ఎమ్మెల్యే డా బి.వి. జయనాగేశ్వర రెడ్డి కోరినారు.



## మహా చండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన పార్వతి దేవి..

విభారె న్యూస్ అక్టోబర్ 07 ఎమ్మిగనూరు..స్థానిక శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవం ాత్రులను పురస్కరించుకొని 5వ రోజైన సోమవారం రోజు పార్వతి దేవికి మహా చండీ దేవి అలంకరణను గావిం చారు. ఉదయం నుండి శ్రీ పార్వతీ పరమేశ్వరులకు ఆలయ పూజారులు వీరయ్య స్వామి, రవి స్వామి వారి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అర్చన వివిధ పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు అలంకరణ గావించి మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం పార్వతి దేవికి మహా చండీ దేవి అలంకరణను దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు వారి కుటుంబ సభ్యులచే అలంకరణను గావించడం జరిగినది. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు.



## సెలవుల్లో పోలీసుల పెట్రోలింగ్ పెంపు

కాకినాడ దసరా పండగ ఉత్సవాలను పురస్కరించుకొని కాకినాడ జిల్లాలో నేరాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాత్రి సమయంలో గస్తీ, పెట్రోలింగ్, బీట్లను పెంచడం జరిగిందని కాకినాడ డిఎస్పి రఘువీర్ విష్ణు తెలిపారు. కాకినాడ పట్టణం లో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సబ్ ఇన్స్పెక్టర్ రాత్రి సమయంలో గస్తీ పెట్రోలింగ్ చేయడానికి ఒక పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. దసరా సెలవులో వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు,వారి వివరాలు, ఇంటి చిరునామా,దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు తెలిపితే పోలీసులు వారి ఇంటికి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. .ఈ కార్యక్రమంలో కాకినాడ నగర సిఐలు. నాగ దుర్గారావు,అప్పలనాయుడు, సత్యనారాయణ,సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరగట్టు కర్రల సంబరాలకు సర్వం సిద్ధం



కర్నూలు, అక్టోబరు 7, (న్యూస్ పల్స్) దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు కర్రల సంబరానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఆలూరు నియోజకవర్గం లోని దేవరగట్టులో ప్రత్యేక విజయదశమి పండుగ రోజు మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా జరిగే సంప్రదాయ సమరమే కర్రల సమరం. దీనినే స్థానికంగా బన్నీ ఉత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవానికి ఆంధ్రతో పాటు తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లడంలో భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి జరుపుకునే ఉత్సవమే సమరమే కర్రల సమరం బన్నీ ఉత్సవంగా పిలుస్తారు. ఈ కర్రల సంబరానికి కొంతమంది మద్యం సేవించి వస్తుండటంతో కర్రలు తిప్ప లేక,.. కర్రల చివర్లో ఉండే ఇనుప చివ్వలు తగిలి తలలు పగులుతున్నాయి. సమరంలో వాడే దివిటీల నుంచి నిప్పు రవ్వలు పడి , తొక్కిసలాటలో కిందపడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈసారి హింసను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా దేవరగట్టును పరిశీలించారు. బందోబస్తును సిద్ధం చేస్తున్నారు. ఈనెల 12న దసరా పండుగ రోజు అర్ధరాత్రి ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఉత్సవానికి బందోబస్తుగా 1000 మందికి పైగా పోలీసులు ఉంటారు. వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఎట్టి పరిస్థితులలో హించకు తావు లేదని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చెప్తున్నారు

## రూ.80కి చేరిన టమాటా



రాజమండ్రి, అక్టోబరు 7, ) టమాటా ధరలు ఒక్కసారిగా సెంచరీ కొట్టేస్తోంది. ఎక్కడ చూసిన 80 రూపాయ కంటే తక్కువకు కిలో టమాటా దొరకడం లేదు. నిన్న మొన్నటి వరకు 50రూపాయల్లోపు ధర పలికే టమాటా ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయిపోయింది. కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్న వాటినోత సరిపెట్టుకుంటున్నారు. అసలే పండగ సీజన్ ఆపై ధర పెరిగిపోవడంతో ఏం తినాలని వాపోతున్నారు. టమాటా లేనిదే దాదాపు ఎవరింట్లో కూడా వంట పూర్తి కాదు. వెజ్ ఆర్ నాన్‌వెజ్ ఏం వండినా టమాటా ఉంటే ఆ వంటకానికి అదనపు రుచి వస్తుంది. కుటుంబానికి సరిపడేలా వంటకం పూర్తి అవుతుంది.ఇప్పుడు టమాటో వందకు చేరుకోవడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. కొందరు చింతపండును వినియోగిస్తుంటే మరికొందరు నిమ్మకాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ పండించే పంట పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి దిగుబడి పూర్తిగా పడిపోయింది. మదనపల్లిలో పరిస్థితి అంతే ఉంది. ఈ మూడు ప్రాంతాల నుంచి వచ్చే టమాటా ఒక్కసారిగా తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. మొన్నటి వరకు యాభైరూపాయల వరకు ఉండే టమాటా ధరలు ఇప్పుడు ఏకంగా వంద రూపాయలకు చేరాయి. ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. మదనపల్లె మార్కెట్‌లోనే టమాటా ధర 80 రూపాయలకుపైగా పలుకుతోంది. అంటే మిగతా ప్రాంతాలకు ఆ సరకు వెళ్లే సరికి వంద రూపాయలకు పైమాటే అంటున్నారు. ఉల్లిగడ్డల ధరలు కూడా ఆ స్థాయిలోనే కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి సరిపడా సరకు రాకపోవడంతో ఉల్లి రేటు పెరిగిపోతోంది. అది కూడా క్వాలిటీ ఉండటం లేదన్నది వినియోగదారులు చెబుతున్న మాట.

## వివాదంలో మరో టీడీపీ ఎమ్మెల్యేలు

విజయవాడ, అక్టోబరు 7, (న్యూస్ పల్స్) తిరుమలలో అన్యమతస్తులు డిక్లరేషన్ ఇవ్వాలన్న నిబంధన ఉంది. లడ్డు వివాదం నేపథ్యంలో తిరుమల సందర్శనకు వెళ్లిన జగన్ సైతం డిక్లరేషన్ ఇవ్వాల్సిందే నన్న డిమాండ్ టిడిపి నుంచి వినిపించింది.అయితే అప్పట్లో ఎటు తేల్చుకోలేక జగన్ చివరి నిమిషంలో తన తిరుమల పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే అంశంపై ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు ఇప్పుడు అడ్డంగా బుక్కయ్యారు. సీఎం చంద్రబాబు సతీ సమేతంగా తిరుమలను సందర్శించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం టిటిడి అధికారులతో సమావేశం నిర్వహించారు.సీఎం అధికారిక ప్రకటన కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వీరిలో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా తదితరులు ఉన్నారు. వీరిద్దరూ అన్యమతస్తులు కావడంతో డిక్లరేషన్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే ఇందులో ఒక్కరు డిక్లరేషన్ ఇవ్వలేదన్నట్లు తెలుస్తోంది. మరొకరు డిక్లరేషన్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది.అయితే వీరిద్దరూ ఇప్పుడు ప్రమాదంలో పడినట్లు సమాచారం.జగన్ విషయంలో జరిగిన ప్రచారం నేపథ్యంలో వైసిపి వీరిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్యమతస్థుడు.తప్పకుండా ఆయన తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చి స్వామి వారిని దర్శించుకోవాలి. కానీ ఆయన డిక్లరేషన్ ఇవ్వలేదని వైసిపి అనుకూల మీడియా తెగ ప్రచారం చేస్తోంది. జగన్ విషయంలో పట్టుబడిన టిడిపి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుంటుందని ప్రశ్నిస్తున్నారు వైసీపీ నేతలు. ఇక గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. రిజర్వుడు నియోజకవర్గం నుంచి గెలిచారు. క్రిస్టియన్ మతానికి చెందిన వ్యక్తి కావడంతో డిక్లరేషన్ ఇచ్చారు. అయితే వాస్తవానికి ఆయన రిజర్వుడు నియోజకవర్గం నుంచి గెలవడంతో.. క్రిస్టియన్ అని తేలితే రిజర్వేషన్ రద్దు అవుతుంది. బీసీ రిజర్వేషన్ మాత్రమే ఉంటుంది.

# ఇంటర్ విద్యలో మార్పులు

విజయవాడ, అక్టోబరు 7 ఏపీ ఇంటర్ విద్యలో మార్పులకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సంస్కరణలను తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇటీవలే విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా ఇదే విషయం చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యలో సమూల మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా అడుగులు పడే అవకాశం ఉంది.ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు తీసుకొచ్చే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే కొత్త నిర్ణయాలను అమలు చేయాలని భావిస్తోంది. పరీక్షల విధానంతో పాటు సిలబస్ ను కూడా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. కొత్తగా ఒక్క మార్కు ప్రశ్నలను కూడా తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇటీవలే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఇంటర్మీడియట్ విద్యలో సమూల మార్పులు తీసుకువస్తామని కూడా చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎన్‌సీఈఆర్టీ బుక్స్ ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. అకడమిక్ కేలండర్, సిలబస్, అధ్యాపకుల పని విభజన, పరీక్షల షెడ్యూల్, పేరెంట్–టీచర్ మీటింగ్, అధ్యాపకులకు శిక్షణ, విద్యార్థుల అటెండెన్స్, విద్యార్థుల సామర్థ్యం పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలోనే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏపీ ఇంటర్ విద్యలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఆర్ట్స్‌లో కొన్ని సబ్జెక్టులు మినహా పూర్తిగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్ ఉంటుందని తెలుస్తోంది. కేవలం సిలబస్ మాత్రమే కాకుండా? పరీక్షల విధానంలో కూడా మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఫస్ట్ ఇయర్ లో ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇవి 20 వరకు ఉండేలా కసరత్తు జరుగుతోంది. సైన్స్ గ్రూప్ సబ్జెక్టుల్లో కూడా ప్రశ్నల సరళి మారే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి అన్ని సబ్జెక్టుల్లోనూ 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఆర్ట్స్ సబ్జెక్ట్ పరీక్షల్లోనూ మార్పులు ఉండనున్నాయి. ఇందుకు సంబంధించిన త్వరలోనే మరింత క్లారిటీ రానుంది.మరోవైపు ఏపీ ఇంటర్ బోర్డు విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. మొదటి విడతలో రాష్ట్రంలోని నాలుగు ముఖ్య పట్టణాల్లో ఈ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి పరిధిలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే గతంలో ఎంపిక చేసిన కాలేజీల్లో... అక్కడి జూనియర్ లెక్చరర్లు విద్యార్థులకు ఐఐటీ శిక్షణ ఇచ్చేవారు. ఈసారి నారాయణ కాలేజీలకు చెందిన ఐఐటీ, నీట్ సిలబస్ బోధించే సిబ్బందితో ఈ శిక్షణ ఇప్పించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.మొదటి విడతలో గుంటూరు, కర్నూలు, నెల్లూరు, విశాఖ నగరాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఈ నగరాలకు 5 లేదా 10 కి.మీ పరిధిలోని ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు నారాయణ సిబ్బంది ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచితంగా నీట్, ఐఐటీ శిక్షణ ఇస్తారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నిర్ణీత సెంటర్‌లో ఇంటర్ రెగ్యులర్ తరగతులతో పాటు ఐఐటీ, నీట్ శిక్షణను పొందుతారు. ప్రత్యేక కేంద్రాల్లో శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేస్తారు. దీంతో అటెండెన్స్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. గతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇలాంటి తరహాలో నీట్, ఐఐటీ శిక్షణను ఇంటర్ బోర్డు ఇచ్చింది. ఆసక్తి ఉన్న ప్రభుత్వ లెక్చరర్లతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. అయితే ఈ విధానం అంతగా ఫలితాలు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది శిక్షణ విధానం మార్చారు. ఆసక్తి గల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి ఐఐటీ, నీట్ శిక్షణను నారాయణ విద్యాసంస్థల సిబ్బంది ఇస్తారు.

## విశాఖలో కొత్త రకం ట్రాప్...

విశాఖపట్టణం, అక్టోబరు 7, (న్యూస్ పల్స్) అందమైన రూపం.. ఆకట్టుకొనే అభినయం.. మాటల కవ్వింపులు.. వయ్యారాల పలుకులు.. ఇంకేముంది అదృష్టం తలుపుతట్టింది అనుకుంటున్నారా.. అయితే మీకు చిక్కులు వచ్చినట్లే. మీ పరువుకు భంగం కలిగినట్లే. సోషల్ మీడియా ద్వారా చిలుక పలుకులు పలకడం.. ఆ తర్వాత బ్లాక్ మెయిలింగ్ చేయడం నేటి సమాజంలో పలువురికి ఒక వృత్తిలా మారింది. ఇలా ఎందరినో వలలో వేసుకొని, మోసం చేసిన ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మహిళ బాధితుల లిస్ట్ తీస్తున్న పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైంది. అందుకే నేరస్తులు సైతం ఇదే మాధ్యమాన్ని వాడుకొని.. ఎందరినో బురిడీ కొట్టిస్తున్నారు. హనీ ట్రాప్ పేరిట జరిగే మోసాలు అయితే రోజురోజుకు అధికమవుతున్నాయి. హనీ ట్రాప్ అంటే ఏమిటో తెలుసా.. సోషల్ మీడియా ద్వారా పరిచయం కావడం.. ఆ తర్వాత వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడం.. మత్తు ప్రయోగించడం.. ప్రవేట్ ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడం. ఇంతకు ఇలా చేస్తున్నది ఎవరో అనుకొనేరు కొందరు అందమైన యువతులు. అందమైన వారే ఎందుకో తెలుసా.. వెంటనే బురిడీ కొట్టించి లక్షలు దండుకోవడం వీరి వంతు.ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలో విశాఖ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎన్నో సంచలనమైన కేసులను చేధించిన విశాఖ పోలీసులు.. ఈ కేసు అంతు తేల్చేలా పక్కా ప్రణాళికతో దర్యాప్తు చేసి నిందితురాలు జాయ్ జెమిమాను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు షాకుల మీద షాకులు తగిలాయి.హనీ ట్రాప్ పేరిట ఒక ముఠాగా ఏర్పడ్డ దుండగులు.. పథకం ప్రకారం జెమిమాను ఉపయోగించి సోషల్ మీడియా ద్వారా ఎందరినో బురిడీ కొట్టించారు. ముందు పరిచయం.. ఆ తర్వాత మత్తు ఇవ్వడం.. అసభ్యకర వీడియోలు తీయడం.. ఇక బెదిరించడం ఇలా సాగేది ఈ ముఠా పని. అలాగే సంబంధిత మహిళకు ఎలా బుట్టలో పడవేయాలో ట్రైనింగ్ కూడా ఇచ్చారంటే ఈ ముఠా కథ వేరే అని చెప్పవచ్చు.అయితే ఈ కేసు గురించి విశాఖ సీపీ బాగ్చి మాట్లాడుతూ.. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి వలలో పడి మోసపోయిన వారు.. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఇదొక ముఠాగా తాము గుర్తించామని, అన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు.. త్వరలోనే మిగిలిన ముఠా సభ్యులను అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత యువకుడికి ఫోన్ చేసి అమెరికా నుంచి విశాఖకు రప్పించింది. ఎయిర్‌పోర్టుకు రాగానే మురళీనగర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి బంధించింది. మత్తు పదార్థాలు కలిపిన జ్యూస్‌లు, డ్రింక్స్ ఇచ్చి పెర్ఫ్యూమ్ స్ప్రే చేస్తూ మైకంలో ఉన్నప్పుడు శారీరకంగా కలిసినట్లు ఫోటోలు తీయించింది. వాటితో యువకుడిని బ్లాకెమెయిల్ చేసింది. దీంతో బెదిరిపోయిన యువకుడు తన తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పిస్తానని చెప్పాడు. అయినా వినిపించకోకుండా జెమిమా తన సహచరులతో కలిసి తరచూ బెదిరించేంది. ఇటీవల బీమిలిలోని ఓ హోటల్‌లో బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని యువకుడితో రూ.5 లక్షలు ఖర్చు చేయించింది. తర్వాత నిశ్చితార్థం, ఏకాంతంగా ఉన్న ఫొటోలు చూపించి మురళీ నగర్‌లోని తన ఇంట్లో నిర్బంధించింది. పెళ్లి చేసుకోకపోతే.. కేసు పెట్టి అమెరికా వెళ్లకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడింది. డబ్బులు కాజేసింది.ఒక రోజు యువకుడు పారిపోయేందుకు యత్నించాడు. దీంతో సహచరులతో కలిసి కత్తితో బెదిరించి చంపడానికి యత్నించింది. జెమిమాను పెళ్లి చేసుకోకుంటే చంపేస్తామని ఆమె అనుచరులు కూడా బెదిరించారు. అక్టోబర్ 4న బాధితుడు తప్పించుకుని భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు జెమిమాతోపాటు ఆమె అనుచరులను అరెస్టు చేశారు. జెమిమా గతంలో కూడా తన స్నేహితులతో కలిసి ధనవంతులైన అబ్బాయిలను ట్రాప్ చేసి భారీగా డబ్బులు వసూలుచేసినట్లు పోలీసులు తెలిపారు.అలాగే సోషల్ మీడియా వేదికగా జరిగే నేరాల పట్ల యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం చిక్కులే తెచ్చే పరిస్థితులు ఉన్నాయని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు విశాఖ సీపీ బాగ్చి.

## జగన్ రియలైజేషన్ మొదలైందా....

కడప, అక్టోబరు 7, (న్యూస్ పల్స్) వైసీపీ అధినేత వైఎస్ జగన్ 2024లో తన పార్టీ దారుణ ఓటమి తర్వాత కొంత మేర ఆయనకు రియలైజేషన్ వచ్చినట్లుంది. ఆయన తన ఐదేళ్ల పాలనలో చేసిన తప్పులేమిటో ఒక్కొక్కటీ తెలుసుకుంటున్నారు. కేవలం సంక్షేమ పథకాలు ఓట్లు తెచ్చిపెట్టవని, బటన్ నొక్కితే ఈవీఎంలలో జనం బటన్ నొక్కరని జగన్ కు జ్ఞానోదయం అవుతున్నట్లు కనిపిస్తుంది. కేవలం తాడేపల్లి ప్యాలెస్ కే పరిమితం కావడం, నేతలను ప్రజలకు దూరం చేయడంతో పాటు వాలంటీర్ల వ్యవస్థతో తాను కొత్త వ్యవస్థను తీసుకు వచ్చానని భ్రమలో ఉన్నానని అర్థమయినట్లుంది. కేవలం నగదు ఇచ్చినంత మాత్రాన ప్రజలు సంతృప్తి చెందరని, వారికి అభివృద్ధి కూడా కావాలని వైఎస్ జగన్ కు క్రమంగా బోధపడినట్లుంది.ఇక పార్టీకి పట్టుకొమ్మలైన కార్యకర్తలను దూరం చేసుకోవడంపై కూడా ఆయన అంతర్మథనం చెందుతున్నారు. ప్రకాశం జిల్లాలో జరిగిన ఒక సభలో మాజీ మంత్రి పేర్ని నాని ఈ విషయాన్ని వెల్లడించారు. జగన్ జనాన్ని బాగు చేద్దామని, కార్యకర్తలను మరచిన మాట వాస్తవమేనని అంగీకరించినట్లు ఆయన తెలపడం కూడా జగన్ ఆలోచనలో మార్పు వస్తున్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే మొన్నటి ఎన్నికల్లో వార్ వన్ సైడ్ జరగడానికి కార్యకర్తలు పట్టుదలగా పనిచేయకపోవడం కూడా ఒక కారణమని ఆయన భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద తెగించి పోరాడిన వైసీపీ క్యాడర్మొన్నటి ఎన్నికల్లో మాత్రం పూర్తిగా చేతులెత్తేశారు.చివరకు తన సొంత జిల్లా కడప నియోజకవర్గంతో పాటు తనకు పట్టున్న రాయలసీమ ప్రాంతంలోనూ దారుణ ఓటమికి కారణం ఇదేనన్న అభిప్రాయం ఆయనలో కలిగిందనే అంటున్నారు. తాను జనంలో లేకపోవడం ఒక కారణమయితే కార్యకర్తల మనోభావాలను పక్కన పెట్టడం, ఎన్నో త్యాగాలు చేయడంతో పాటు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. మురిసిపోయిన విషయాన్ని కూడా ఆయన గుర్తుకు చేసుకున్నట్లుంది. అధికారంలోకి రాగానే కార్యకర్తలను పట్టించుకోకపోవడం, వారు ఆర్థికంగా మరింత బలహీనం కావడంతో పార్టీ జెండాను కూడా మోయలేని పరిస్థితికి వచ్చారు.

## పవన్ ఫామ్ కోల్పోతారా...

తిరుపతి, అక్టోబరు 7, జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ అయిన తర్వాత ఒకింత ఫామ్ కోల్పోతున్నారా? ఏదో చేద్దామని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఏమీ చేయలేక నిరాశ నిస్పృహలో మిగిలిపోయారా? అందుకే సనాతన ధర్మం ముసుగు వేసుకుని తిరుగుతున్నారా? అన్న కామెంట్స్ ఇప్పుడు ఆయన అభిమానులనే కాదు కాపు సామాజికవర్గాన్ని కూడా వేధిస్తున్నాయి. ఎన్నికల ముందు వరకూ పవన్ కల్యాణ్ లో కనిపించని సనాతన ధర్మం ఇప్పుడు ఒక్కసారిగా కనిపించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ ఘటనలు జరిగాయా? కదా? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం లేదు.అప్పుడు రామతీర్థంలో రథం తగలపడటం వంటి ఘటనలు జరిగినా పవన్ కల్యాణ్ కు అప్పుడు సనాతన ధర్మం ఎందుకు గుర్తుకు రాలేదని, నాడు ఆ దుస్తులు ఎందుకు ధరించలేదని, ఎందుకు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టలేకపోయారన్న సందేహాలు ఆయన ఫ్యాన్స్ లో ప్రతి ఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆనాడు గుర్తుకు రాని, పాటించని సనాతన ధర్మాన్ని ఒక్కసారిగా అధికారంలోకి రాగానే ఎందుకు గుర్తుకు వచ్చిందని, విపక్షంలో చేయాల్సిన పనులు అధికారంలో ఉన్నప్పుడు చేయడానికి గల కారణాలు ఏమై ఉంటాయా? అన్న అనుమానాలు అందరిలోనూ ఉన్నాయి. కానీ అందుకు సమాధానం చెప్పాల్సింది పవన్ కల్యాణ్ మాత్రమే. అందుకు కారణాలు కూడా ఆయనకు మాత్రమే తెలిసి ఉంటుందిఒక్కసారిగా పవన్ కల్యాణ్ లో ఈ మార్పు రావడానికి కారణం ఏమై ఉంటుందా? అన్నది అర్థం కాకుండా ఉంది. ఒకవేళ పవన్ కల్యాణ్ ను వెనక నుంచి ఎవరైనా ఇలా చేయమని ప్రోత్సహిస్తున్నారా? అది రాష్ట్ర స్థాయిలో కాకుండా దేశ స్థాయిలో జరుగుతుందా? అన్న సందేహాలు కూడా లేకపోలేదు. ఎందుకంటే ఇప్పటికే సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ ఈ సనాతన ధర్మం నినాదం అందుకోవడం వెనక బీజేపీ ఉందన్న కామెంట్స్ బాగానే వినపడుతున్నాయి. అయితే అందులో నిజం ఎంతో తెలియదు కానీ, దక్షిణ భారత దేశంలో బలమైన హిందుత్వ వాది తమకు అవసరం కావడంతో అందుకు పవన్ కల్యాణ్ ను వినియోగిస్తున్నారని అంటున్న వారు అనేక మంది ఉన్నారు.కానీ బీజేపీ అలాంటి పని చేయకపోవచ్చు. బీజేపీ సొంతంగానే ఎదుగుతుంది. మరొకరి చేతిలో, మరొక పార్టీ అధినేత చేతిలో హిందుత్వ నినాదాన్ని అప్పగించి తాను తప్పుకునేంత పిచ్చిపనులు చేయదన్నది కూడా మరికొందరి వాదన. కానీ పవన్ కల్యాణ్ మాత్రం సనాతన ధర్మంతో పాటు ప్రాయశ్చిత్త దీక్ష వంటి వాటితో కొన్ని వర్గాలకు దూరమవుతున్నారన్న ఆందోళన కూడా ఆయన అభిమానుల్లో వ్యక్తమవుతుంది. పవన్ ను అభిమానించే వారు ఈ సలహా ఎవరు ఇచ్చారన్న దానిపై ఆరాలు తీయడం మొదలు పెట్టారట. ఇది రాజకీయంగా పవన్ కు నష్టం చేకూరుస్తుందే తప్ప లాభం ఎంత మాత్రం చేకూర్చదన్న బలమైన వాదన మాత్రం వినిపిస్తుంది.

## పదేళ్ల పవన్ ప్రస్థానం...

### నాస్తికుడి నుంచి ఆస్తికుడి దాకా....

కాకినాడ, అక్టోబరు 7, (న్యూస్ పల్స్) పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. సినిమాలతో యూత్‌లో మహా క్రేజ్ సంపాదించుకున్న నటుడు. జనసేన పార్టీ అధినేతగా రాజకీయాల్లో అడుగు పెట్టారు. అంతకు ముంద తన అన్న మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి.. యువరాజ్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పనిచేశాడు. దూకుడుతనం, ఆవేశం ప్రదేశించే పవన్ కల్యాణ్ ప్రజారాజ్యం కాంగ్రెస్లో విలీనం అయిన తర్వాత 2014లో జనసేన పార్టీని స్థాపించారు. పూర్తిగా సోషలిస్టు భావాలతో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. చెగువెరా వారసునిగా ప్రచారం చేసుకున్నారు. బ్రెజిల్‌కు చెందిన చెగువెరా.. అనేక రెవల్యూషనరీలో పాల్గొన్నారు. క్యూబా మంత్రిగా పనిచేశారు. ఆయన యూత్ ఐకాన్. అమెరికా కాల్పుల్లో చనిపోయాడు. కానీ అమెరికా ఫొటోగ్రాఫర్ తీసిన చెగువెరా ఫొటో ఇప్పటికీ చాలా మంది తమలో స్ఫూర్తి నింపుకునేందుకు వాడుకుంటారు. పవన్ కళ్యాణ్ కూడా మొదట్లో చెగువెరా స్టైల్‌ను ఫాలో అయ్యాడు. దూకుడుగా వ్యవహరించారు. ప్రజావ్యతిరేక పాలకులపై తిరగబడే నేతగా గుర్తింపు పొందారు. పార్టీ స్థాపించిన సమయంలో తన వేదికపై పూలే, కాన్షీరామ్, చెగువెరా లాంటి ఫొటోలు ఉంచి ఆకట్టుకున్నాడు. తన భావాలు కమ్యూనిస్టు భావాలు అని ప్రకటించారు.అయితే 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ?బీజేపీ కూటమికి మద్దతు తెలిపారు. దీంతో కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటి కమ్యూనిస్ట భావాలు అని చెప్పి.. బీజేపీకి మద్దతుగా నిలవడం చర్చనీయాంశమైంది. అయితే.. తర్వాత తన పంథా మారుతుందని గుర్తించి.. టీడీపీ?బీజేపీ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. లోకేశ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ విధానాలను తప్పు పట్టారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చిందని విమర్శించారు. ఈ క్రమంలో కూటమికి దూరమయ్యారు.ఇక 2018లో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల్లో జనసేన పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో జనసేన, సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేశాయి. తద్వారా తనది కమ్యూనిస్టు భావజాలమని మరోమారు చెప్పారు. పవనిజం పేరుతో ఓ పుస్తకం కూడా విడుదల చేశారు. ఇక ఎన్నికల ప్రచారంలో కూడా కమ్యూనిస్టు నినాదాలు చేశారు. కానీ పెద్దగా ఫలితాలు రాలేదు. తర్వాత 2019 జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులతోపాటు బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతిని తీసుకువచ్చి ప్రచారం చేయించారు. దేశానికి ప్రధాని కావాల్సిన దళిత నేత అని కీర్తించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేశాయి. జనసేన మాత్రం వామపక్షాలు, బీఎస్పీతో కలిసి పోటీ చేసింది. కానీ ఈ ఎన్నికలు కూడా నిరాశే మిగలింది. ఈ క్రమంలో వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం మొదలు పెట్టారు. అయితే ఎన్నికల తర్వాత బీఎస్పీ, వామపక్షాలతో తెగదెంపులు చేసుకున్నారు. మళ్లీ బీజేపీకి దగ్గరయ్యారు. మోదీని కలుస్తూ.. బీజేపీ నిర్ణయాలకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో వైసీపీని ఓడించేందుకు టీడీపీతో మళ్లీ చేతులు కలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. కూటమిగా పోటీచేసి విజయం సాధించారు. 100 శాతం సక్సెస్ రేటులో పోటీ చేసిన 20 అసెంబ్లీ సీట్లు గెలిచారు. 2 ఎంపీ స్థానాలను గెలిపించారు. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం అయ్యారు.ప్రస్తుతం పవన్ సనాతన ధర్మ పరిరక్షకుడిగా ప్రకటించుకున్నారు. తిరుపతి లడ్డూ వివాదం నేపథ్యంలో ఆయన ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. అంతకు ముందు సనాతన ధర్మం గురించి మాట్లాడారు. హిందువుల్లో ఐక్యత లేకపోవడంతోనే మన ధర్మాని, దేవుళ్లను అవమానిస్తున్నారని ఆరోపించారు. దీక్ష విరమణ తర్వాత కూడా తనకు రాజకీయాలు పదవులు ముఖ్యం కాదని, సనాతన ధర్మం పరిరక్షించబడాలన్నారు. తన ధర్మం జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని ప్రకటించారు. దీంతో పూర్తిగా హిందుత్వ వాదిగా మారిపోయారు. ఎన్నికలకు ముందు కూడా పూజలు, యజ్ఞాలు, హోమాలు, యాగాలు, పూజలు చేశారు.సనాతన ధర్మ పరిరక్షణకు పవన్ పోరాటం వెనుక ఉద్దేశం వేరే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్నలు కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సీపీఐ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-నంద్యాల జిల్లాలో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, క్వింటల్ కు 3000రూపాయలు గిట్టుబా టు ధర కల్పించాలని, మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న రైతుల నుండి కొనుగోలు చేయాలని సీపీఐ, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కే. రాధాకృష్ణ, నాగరాముడు, భాస్కర్, మోటారాముడు, సిపిఐ సీనియర్ నాయకుల సంజీవులు. జిల్లా సమితి సభ్యులు డి శ్రీనివాసులు.వై. భార్గవ్,బాలకృష్ణ హరినాథ్, జి. రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లానాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్థలం కబ్జా


## ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-నాగులకుంట రోడ్డునందు మున్సిపాలిటీ కి చెందిన స్థలం కబ్జాకు గురైందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన హైందవులు పవిత్రంగా భావించి పూజించే పాలకొమ్మ చెట్టు ఉన్న సర్వే నెం. 841 స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించు కు న్నారని తెలిపారు . తప్పుడు సర్వే నెంబరు చూపించి చెట్టును నరికి వేశారని తెలిపారు . సదరు స్థలం తనదని మున్సిపల్ అధికారుల అండదండలతో అప్రూవల్ తెచ్చుకొని కోట్ల రూపాయలు విలువ చేసే పాల కొమ్మ చెట్టు ఉన్న స్థలాన్ని యదేచ్ఛగా కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాలకొమ్మ చెట్టు కింద మాదిగలు చెప్పులు కుట్టేవారని అన్నారు . జీవనోపాధి ఉన్న పాల కొమ్మ చెట్టు స్థలం కబ్జాకుగురికావడంఅన్యాయమన్నారుఈ స్థలాన్ని కాపాడాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు రవికిరణ్ మాదిగ ఆధ్వర్యంలో నిరసన గళం విప్పారు. న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఈ నెల జరుగబోవు మున్సిపల్ సమావేశాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన గాయత్రి దేవి..

విభారె న్యూస్ అక్టోబర్ 07 ఎమ్మిగనూరు..దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 5వ రోజైన సోమవారం శ్రీ లలితా త్రిపుర సుందరి అలంకరణలో గాయత్రి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తండోపతండాలుగా పాల్గొని అమ్మ వారిని దర్శించు కున్నారు. గా యత్రి అమ్మవారికి ఆల య అర్చకు లచే విశేష పూ జలు నిర్వహిం చారు. పూజ అ నంతరం భక్తులకు ప్రసాద వితరణ గావిం చారు



# అకాల వర్షం అపార నష్టం

## ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో గత శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, తడిచిపోయిన మొక్కజొన్న ధాన్యపు గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సోమవారం నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ . కాకరవాడ చిన్న వెంకటస్వామి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం లో శనివారం నాడు తెల్లవారుజామున కురిసినటువంటి అకాల భారీ వర్షం వల్ల మొక్కజొన్న పంట వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన రైతులు దాదాపు 300 ఎకరాల ఆరబెట్టిన మొక్కజొన్న దాన్యం నీటిలో తడిచిపోయి, కొట్టుకపోవడం జరిగిందన్నారు , అదేవిధంగా జూపాడు బంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, పగిద్యాల,



నందికొట్కూరు మండలాలలో రైతులు నష్టపోవడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు యాబై రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, వర్షంలో తడిచినటువంటి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ద్వారా కోరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ రెడ్డి, ఈశ్వరయ్య, రఘునాథ్ రెడ్డి, శీలం నాగరాజు, భగవాన్ చౌదరి, జి. నాగిరెడ్డి, గుర్రప్ప, భాస్కర్, శివకుమార్, శేఖర్ తదితర బాధిత రైతులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు.

# పరిహారం అందని బాధితులకు నగదు పంపిణీ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-గత ఆగస్టు 30, 31 తేదీలలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలకు నష్టపరిహారం అందించామని సాంకేతిక కారణాలవల్ల పరిహారం అందని బాధితులకు నగదు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. సోమవారం కలెక్టర్ లోని సెంటనరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలలో భాగంగా నష్టపరిహారం అందని పదిమంది బాధితులకు లక్ష రూపాయల నగదును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అధిక వర్షాల దెబ్బతిన్న పంటలు, గృహాలు, పశుసంపద బాధితుల పరిహారానికి సంబంధించి బ్యాంక్ ఖాతాలో ఆధార్ అనుసంధానం కాకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో నిధులు జమ కాని 10 మంది బాధితులకు నగదు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందని బాధితుల అంశాన్ని అత్యంత




ప్రాధాన్యతగా తీసుకొని సంబంధిత మొత్తాలను కలెక్టర్ల అకౌంట్ లలోకి జమ చేసి నష్టపరిహారం అందని బాధితులకు అందజేయాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు అధిక వర్షాలకు దెబ్బతిన్న 331 గృహ బాధితులకు గాను 321 మంది ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని మిగిలిన 10 మంది బాధితులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున లక్ష రూపాయలు నగదు మొత్తాలను పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలే అధికం

## పిజిఆర్ఎస్ కు 210 విజ్ఞప్తులు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం - (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి210 అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ. పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ గైరాజరైన వికలాంగుల శాఖ ఏడి, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్, ఎక్సైజ్, గనుల శాఖ అధికారి, స్కిల్ డెవలప్మెంట్ , ఉప రవాణా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఆర్ఓను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కు 90 శాతం సమస్యలు రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలే అధికంగా వస్తున్నాయని వీఆర్వో, ఆర్ఐ, డీటీలు డిజిటల్ కీ ద్వారా వెబ్ల్యాండ్ లో మారుస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యం



లో...డిపట్టాలుమంజూరుచేసినవారివివరాలను సేకరిస్తున్నామని పేర్లు మార్చాడానికి మీరెవరని కలెక్టర్ ప్రశ్నిస్తూ... టైటిల్ డిక్లేర్ అయితే ఇబ్బందులు ఎదుర్కొంటార న్నారు. పొరంబోకు రస్తా స్థలాలపై డి పట్టా ఇచ్చిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒత్తిడిలకు లోనై నిబంధనలను అతిక్రమిస్తే వృత్తికే ప్రమాదం ఏర్పడుతుందని ఆమె హెచ్చరించారు. ఇటీవల జరిగిన భూ బదలాయింపులో నిబంధనలు అతిక్రమించిన అధికారికి మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేశామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ రికార్డుల మేరకు నిజమైన కక్షిదారులకు చేయాల్సిన పనులపై శ్రద్ధ పెట్టి పనులు చేయాలని ఆమె సూచించారు. చేయలేని వారికి మాత్రం సరైన కారణాలు చూపి ఎండార్స్ ఇవ్వాలన్నారు. రెవెన్యూలో చట్ట వ్యతిరేకంగా పనులు చేసి బదిలీ అయినా రిటైర్డ్ అయిన సంబంధిత అధికారులను వెంటాడుతూ క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆళ్లగడ్డలో 9న అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం...

విభారె న్యూస్ అక్టోబర్ 07 ఆళ్ళగడ్డ మా ప్రతినిధి:- ఆళ్లగడ్డ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ను ఈనెల 9 న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంటీన్ ద్వారా పేద ప్రజలకు కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి కౌన్సిల్ బృందం పాల్గొంటున్నట్లు కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు.




# 200 రోజుల ప్రణాళిక లక్ష్యాలను సిద్ధం చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-జిల్లాలో అన్ని గ్రామాలలో స్మశాన వాటికలకు స్థల సమస్య ఉందని రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి స్థలాలను అన్వేషించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఆర్డీఓలు, తాసిల్దారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటనరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలలో భాగంగా జిల్లా అధికారులు, మండల స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్మశాన వాటికల స్థల కేటాయింపుపై 2023 సంవత్సరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ ప్రతి మండలంలో స్మశాన వాటికల స్థల సమస్య ఉందని మండల తాసిల్దారులు, ఆర్డీఓలు ప్రత్యేక దృష్టితో స్థలాలను అన్వేషించి గ్రామాల వారీగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. స్మశాన వాటికల స్థల సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వార్తాపత్రికలలో ప్రతికూల వార్తలు వస్తున్న నేపథ్యంలో పుణ్యకార్యంగా భావించి ప్రాధాన్యతాంశంగా స్థలాలను అన్వేషించి గ్రామాల వారిగా నివేదికలు అందజేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న 60 చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు కూడా స్థలాలను గుర్తించి కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసుల కింద 1753 దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లాయని జిల్లా అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వారంలో ఒకరోజు కేటాయించుకుని క్లియర్ చేయాలని ఆమె సూచించారు. రెవెన్యూ లో 1208, పోలీస్ శాఖలో 184, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లో 90 తదితర శాఖల్లో పెండింగ్లో ఉన్న ఏపీ సేవా సర్వీసులను రెండు రోజులలో క్లియర్ చేయాలని ఆమె ఆదేశించారు. ఏపీ సేవా సర్వీస్ ద్వారా 540 సర్వీస్ లను ప్రజలకు అందిస్తున్నామని ఆలస్యం చేయకుండా నిర్ణీతకాల పరిమితిలోగా ప్రజలకు సేవలు అందించాలన్నారు.

# శ్రీ గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన కాళికామాత అమ్మవారు



విభారె న్యూస్ అక్టోబర్ 07 ఆళ్ళగడ్డ మా ప్రతినిధి :- పట్టణంలోని కాళికామాత ఆలయంలో కాళికామాత సోమవారం గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కాళికామాత ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దురుగడ్డ రవీంద్ర ఆచారి ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి అందులో భాగంగా 5వ రోజు సోమవారం కాళికామాతను చంద్రశేఖర్ ఆచారి గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగుకు చెందిన గోల్డ్ రామాచారి,వీరభద్రమ్మ దంపతులు, సురేష్ ఆచారి లక్ష్మీప్రసన్న, దంపతులు,నరసింహాచారి రాజేశ్వరి దంపతులు, విఘ్నేష్ నాగలక్ష్మి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి పూజలో భాగంగా ముందుగా శ్రీ చక్రానికి పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190